నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 13 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



శ్రీరాంపూర్ ఆర్కే 7 భూగర్భ గనిలో ఎస్‌డీఎల్ యంత్రాన్ని నడుపుతున్న సీఎండీ బలరాం

# యంత్రాలతో ఉత్పత్తిని పెంచాలి

- సింగరేణి సీఎండీ బలరాం
- ఆర్కే 7గనిలో ఎస్‌డీఎల్ పనితీరు పరిశీలన

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 : భూగర్భగనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాల పనిగంటలు పెంచాలని సింగరేణి కార్మికులు, అధికారులకు సీఎండీ ఎన్ బలరాం సూచించారు. బుధవారం సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 భూగర్భగనిలోకి సీఎండీతో పాటు డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు మ్యాన్‌రైడింగ్ ద్వారా దిగారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎల్ యంత్రాన్ని సీఎండీ నడిపి కొద్ది సేపు బొగ్గు ఉత్పత్తి తీశారు. అనంతరం ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, కోల్ కట్టర్లు, టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, అధికారులతో మాట్లాడి గనిలో పని పరిస్థితులు, యంత్రాల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల పనిగంటలు పెంచాలని, ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు కార్మికుల పనిగంటలు పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూజీఎం సత్యనారాయణ, ఏజెంట్ రాజేందర్, మేనేజర్ జెంగిలి తిరుపతి, డీవైజీఎం చంద్రలింగం, అరవిందరావు, ఏఐటీయూసీ నాయకులు బాజీసైదా, వీరభద్రయ్య, తదితరులున్నారు.




సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

### కార్మికుల సమస్యలపై టీబీజీకేఎస్ వినతి

శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లును టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, పిట్ కార్యదర్శి బానోత్ రాజునాయక్, సహాయ కార్యదర్శి పాదం శ్రీనివాస్ కలిసి కార్మికుల సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా సీఎండీతో పాటు డైరెక్టర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల మారుపేర్లు సవరించాలని, దీనిపై ఇప్పటికే యాజమాన్యం హామీ ఇచ్చిందని చెప్పారు. 11వ వేజ్‌బోర్డులో రిటైర్డ్ కార్మికులకు పింఛన్ రివైజ్ చేయాలని, ఏరియర్స్ చెల్లించాలని కోరారు. శ్రీరాంపూర్‌లో మూతపడనున్న గనులు ఆర్కే 5, 6, ఎస్ఆర్పీ 1, న్యూటెక్ గనుల జీవిత కాలం పెంచాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియాలో శిథిలమైన క్వార్టర్ల స్థానంలో నూతన డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించాలని కోరారు. శ్రీరాంపూర్‌లో నిర్మిస్తున్న గ్రావిటీ వాటర్ ఫిల్టర్ ద్వారా రక్షిత నీటి సరఫరా పనులు త్వరగా పూర్తి చేయాలని , గనుల్లో టెక్నీషియన్లు కొరత తీర్చాలని, నాణ్యమైన పనిముట్లు, బూట్లు అందించాలని కోరారు. ఆర్కే 8 డిస్పెన్సరీని 50 పడకల దవాఖానగా మార్చి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిరుదు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చెన్నూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి సస్పెన్షన్

చెన్నూర్, ఫిబ్రవరి 12: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోళ్ల విషయంలో కౌలు రైతులకు సంబంధించిన డాటా తాత్కాలిక రిజిస్ట్రేషన్‌లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఈ అవకతవకలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.




# రైతు భరోసా రాకపాయే..

## మూడెకరాలున్న వారికి జమ అంటున్న సర్కారు

- రెండెకరాల్లోపు ఉన్నా రాలేదంటున్న కొందరు రైతులు
- బ్లాక్‌లో పడిపోయిందేమో అంటూ అన్నదాతల ఆందోళన
- గతంలో సమయానికి పెట్టుబడి సాయం..
- ఇప్పుడేమో అలా లేదంటూ వాపోతున్న కర్షకులు

### రైతు భరోసా పడలేదు..



*జైపూర్, ఫిబ్రవరి 12: నాపేరు మాదాసు శంకర్ మాది జైపూర్ మండలంలోని ఇందారం గ్రామం, నాకు గ్రామ శివారులో రెండెకరాల భూమి ఉంది. ఏడాది నుంచి రైతు భరోసా రాలేదు. మూడెకరాలు ఉన్నవారికి రైతుభరోసా వేస్తామని ప్రభుత్వం అనగానే ఆశతో చూస్తున్నాం. గత ప్రభుత్వంలో ఈ విధంగా లేకుండే రెగ్యులర్‌గా రైతు బంధు వచ్చేది. ఇప్పుడు మాత్రం సంవత్సరం నుంచి రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లో పడలేదు. కొంతమందికే రైతు భరోసా పడింది మాకు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రైతు భరోసా పడలేదు. కొంత మందికేమో సెల్‌కు మెస్సేజ్‌లు వచ్చినయ్ అకౌంట్లలో మాత్రం డబ్బులు జమ కాలేదు.*

మంచిర్యాల, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గడిచిన ఏడాది పాలనలో రైతన్నలకు ఒరిగిందేం లేదు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల సమయానికి నీళ్లు, పంట పెట్టుబడి సాయం, మద్దతు ధరకు కొనుగోళ్లలో కళకళలాడిన అన్నదాతలు.. గడిచిన ఏడాదిగా ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇది తెలంగాణ రైతులు ఎవరిని కదిలించినా చెప్తున్న మాట. రుణమాఫీ అని చెప్పి కొందరికే చేశారు. రానోళ్లకు రాకుండానే పోయింది. పంట పెట్టుబడి సాయం రూ.15 వేలు అని చెప్పి చివరకు రూ.12 వేలు ఇస్తామంటున్నరు. గతంలో తొలి రోజు ఎకరం భూమి ఉన్న రైతుకు, రెండో రోజు రెండు ఎకరాలలోపు భూమి ఉన్న రైతుకు, మూడో రోజు మూడు ఎకరాల లోపు ఉన్న రైతుకు ఇలా ఎన్ని ఎకరాలు ఉన్నా రైతులందరికీ పంట పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు జనవరి 26న మొదలుపెడితే ఫిబ్రవరి 10వ తేదీ దాకా రెండు ఎకరాలున్న రైతులకు కూడా పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయం రాలేదు. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి మూడెకరాలు ఉన్న రైతులకు రైతు భరోసా వేయడం మొదలుపెట్టామని సర్కారు చెప్తున్నా.. రెండు ఎకరాలలోపు ఉన్న చాలా మందికి భరోసా పడలేదని రైతులు వాపోతున్నారు.

### భూములు గల్లంతు.. లెక్కల్లో తేడాలు..

రైతు భరోసా రూ.15 వేలు కాదు.. రూ.12 వేలు ఇస్తామంటూ మాట మార్చి మోసం చేసింది సర్కారు. పోనీ ఎంతో కొంత వస్తుందనుకుంటే సాగులో ఉన్న భూములకే అంటూ, సర్వే అంటూ ప్రకటన చేసింది. ఎట్లతే ఏమున్నది మాకు రైతు భరోసా వస్తే చాలనుకున్నారు రైతులు. ఇప్పుడు రైతు భరోసా వెబ్‌సైట్ నుంచి రైతుల భూముల వివరాలు గల్లంతయ్యాయి. కొందరు రైతుల భూముల వివరాలు పూర్తిస్థాయిలో మాయమైపోగా, మరికొందరు రైతులు భూముల వివరాలు సగమే ఉన్నాయి. నాలుగు ఎకరాలు ఉన్న రైతుకు రెండు ఎకరాలే నమోదైంది. ఇలా జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ప్రధాన పత్రికలు, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండెకరాలలోపు భూమి ఉండి రైతు భరోసా పడని వాళ్లు.. మా భూములు బ్లాక్ లిస్టులో పెట్టారా? ఏమో అని కంగారు పడుతున్నారు. అధికారుల దగ్గరికి వెళ్లి కలిసేందుకు సిద్ధం అవుతున్నారు.

### రుణమాఫీ కాలే.. రైతు భరోసా రాలే..



*చింతలమానేపల్లి, ఫిబ్రవరి 12 : నాకు ఎకరం పట్టా భూమి ఉంది. మొదటి విడుతలో రైతు భరోసా డబ్బులు రాలేదు. రెండో విడుతలో కూడా ఇప్పటి వరకు పడలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో గృహ జ్యోతి, రైతు రుణమాఫీ కూడా నాకు రాలేదు. మా కుటుంబ సభ్యులకు ఏ ఒక్కరికీ రైతు భరోసా రాలేదు. రుణమాఫీ కాలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమైంది. గత కేసీఆర్ పాలన బాగుండేది. పథకాలు సరిగ్గా అమలయ్యేవి. రైతు బంధు డబ్బులు సమయానికి అకౌంట్‌లో పడేవి.*

***- నికోడే సందీప్, డబ్బా గ్రామం, చింతలమానేపల్లి***

# రెచ్చిపోతున్న బియ్యం మాఫియా!

## ఇన్‌ఫార్మర్ నేపంతో యువకుడిపై స్మగ్లర్ల దాడి

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు
- అక్రమ రవాణాదారుల మధ్య విభేదాలతోనే బయటపడుతున్న అక్రమాలు
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్



పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతున్నది. అక్రమార్జనకు అలవాటుపడిన బియ్యం స్మగ్లర్లు కొందరు అధికారులు, పోలీసులతో భేరాలు కుదుర్చుకొని మరీ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి!? ఇద్దరు స్మగ్లర్ల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడం, ఇందులో అధికారులతో జరిగిన ఒప్పందాలపై ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. రేషన్ బియ్యం స్మగ్లర్ల మధ్య వచ్చిన విభేదాల కారణంగా ఒకరి అక్రమ రవాణాను మరొకరు బయటపెడుతున్నారు. సమాచారం అందుకుంటున్న పోలీసులు బియ్యం వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాగజ్‌నగర్‌లో ఇన్‌ఫార్మర్ అనే అనుమానంతో మంగళవారం రాత్రి ఓ యువకుడిపై స్మగ్లర్లు దాడి చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పేదలకు ఉచితంగా అందించాల్సిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు అక్రమంగా తరలించడమే వృత్తిగా మార్చుకున్న స్మగ్లర్లు సంబంధిత అధికారులను మచ్చిక చేసుకొని కాగజ్‌నగర్ కేంద్రంగా దందాను కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. స్మగ్లర్లలో విభేదాల కారణంగా విడిపోయి వేర్వేరుగా దందా చేస్తున్నారు. ఈ క్రమంలో ఒకరి అక్రమ రవాణాపై మరొక స్మగ్లర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. స్మగ్లర్లతో మంచి సంబంధాలను కలిగి ఉన్న పోలీసులు కూడా గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పుడప్పుడు మాత్రమే అక్రమ బియ్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రేషన్ బియ్యాన్ని సేకరించి రాష్ట్ర సరిహద్దు మండలమైన సిర్పూర్–టీ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

### స్మగ్లర్ల మధ్య సంభాషణ వైరల్..

బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు, ఇతర అధికారులతో ఒప్పందం చేసుకున్న స్మగ్లర్ల మధ్య జరిగిన సంభాషణ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సిర్పూర్ నియోజకవర్గంలోని మహారాష్ట్ర సరిహద్దు మండలంలో ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్ఐకి రూ.50 వేలు, తహసీల్దార్‌కు రూ.20 వేలు, రవాణా శాఖ వాళ్లకు రూ.15 వేలు, సివిల్ సప్లయ్ అధికారులకు కూడా డబ్బులు ఇచ్చి మేనేజ్ చేసుకున్నట్లు స్మగ్లర్లు చర్చించుకున్నారు. పోలీసులు సూచించిన విధంగా సాయంత్రం 7నుంచి 10 గంటల వరకు, ఉదయం 3 గంటల నుంచి 7 గంటల వరకు మాత్రమే బియ్యం వాహనాలు బార్డర్ క్రాస్ చేయాలని స్మగ్లర్లు మాట్లాడుకున్నారు. సిర్పూర్‌లో మంగళవారం పెద్ద మొత్తంలో రూ.7.48 లక్షల విలువైన 208 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. ఇన్‌ఫార్మర్ నెపంతో కాగజ్‌నగర్‌లో అక్రం ఖాన్ అనే వ్యక్తిపై దాడిచేయడంతో స్మగ్లర్లకు పోలీసులకు ఉన్న సంబంధాలు బయటపడుతున్నాయి.

### ఆగని అక్రమ రవాణా..

కాగజ్‌నగర్ కేంద్రంగా రేషన్ బియ్యం వాహనాలను సిర్పూర్ మీదుగా బైపాస్ రూట్లలో బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలోని వీరూర్ ప్రాంతంలో అక్కడి వ్యాపారులు ప్రత్యేకంగా గోదాంలను ఏర్పాటు చేసుకొని ఇక్కడి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.12 నుంచి 15 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్న స్మగ్లర్లు మహారాష్ట్రలో 30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. అక్రమ బియ్యం వ్యాపారంలో అధిక లాభాలు వస్తుండడంతో అధికారులతో ఒప్పందాలు చేసుకొని మరీ స్మగ్లరు బియ్యం రవాణే తమ వృత్తిగా మలుచుకొని దందాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

### అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

*కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. సిర్పూర్‌లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుకున్న మరిన్ని చర్యలు తీసుకుంటున్నాం. బార్డర్‌లో రెండు చెక్‌పోస్టులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. బియ్యం అక్రమ రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ రవాణా దందాపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని తెలిపారు.*

***- డీవీ శ్రీనివాస రావు, జిల్లా ఎస్పీ***

### దాడి చేసిన వారిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అక్రమ్ ఖాన్‌పై మంగళవారం రాత్రి దాడి చేసిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. రేషన్ బియ్యం రవాణాపై పోలీసులకు ఇన్‌ఫర్మేషన్ ఇచ్చావంటూ అక్రమ్‌ఖాన్‌పై రజాక్, ఫారూఖ్, సమీర్ దాడి చేశారని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.7లక్షల విలువైన రేషన్ బియ్యం


గంగాపూర్ జాతరకు పోటెత్తిన భక్తులు



# భక్తజన సంద్రం.. గంగాపూర్ జాతర

## వైభవంగా బాలాజీ వేంకటేశ్వరుని కల్యాణం, రథోత్సవం

రెబ్బెన, ఫిబ్రవరి 12: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులో గల గుట్టపై కొలువై రెండో తిరుపతిగా విరాజిల్లుతూ విశేష పూజలు అందుకుంటున్న బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరకు భక్తులు బుధవారం పోటెత్తారు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా జాతర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రథోత్సవం, కల్యాణం, ప్రత్యేక పూజలు కనుల పండువగా జరిగాయి. ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ అధికారులు వసతులు కల్పించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, మంచిర్యాల జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిరోష, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వేణుగోపాల్ గుప్తా, ఈవోలు బాపురెడ్డి, రమేశ్, రవి, ఆలయ కమిటీ చైర్మన్ జయరాం, ఆర్‌టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, గౌడ సంఘం అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ బాలేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు గంటుమేర, కొవ్వూరి శ్రీనివాస్, రవీందర్, నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు